

నేటి నుంచి టెన్త్ మూల్యాంకనం

గుజరాతీపేట, మార్చి 31: పదో తరగతి మూల్యాంకనం సోమవారం నుంచి ప్రారంభంకానుంది. దీనికోసం శ్రీకాకుళంలో రెండు కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్లు డీఈవో కె.వెంకటేశ్వరరావు తెలిపారు. మొత్తం ఏడు పేపర్లకు సంబంధించి 24 పేజీల బుక్‌లెట్‌తో కూడిన 2 లక్షల పేపర్లు జిల్లాకు చేరుకున్నాయి. కోడింగ్ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం, ఒరియా మీడియం జవాబు ప్రతాలను దిద్దనున్నారు. ఎనిమిది రోజుల్లో మూల్యాంకనం పూర్తి చేయనున్నట్లు డీఈవో తెలిపారు. అధికారులు, ఎగ్జామినర్లు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

వైసీపీ దుష్ప్రచారం

- పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా ఉంచాలన్న ఎన్నికల కమిషన్
- దీనికి చంద్రబాబే కారణమంటూ అధికార పార్టీ నిందలు
- సోషల్ మీడియాలో తప్పుడు మెసేజ్‌లు ● మండిపడుతున్న జనాలు


(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఎన్నికల వేళ అధికార పార్టీ దుష్ప్రచారానికి తెరతీసింది. పింఛన్ల పంపిణీకి వలంటీర్లను దూరంగా ఉంచాలన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ఎత్తుగడలు వేస్తోంది. కావాలనే పింఛన్లను పంపిణీని ఆలస్యం చేసి దీనికి కారణం ప్రతిపక్షాలే అని విష ప్రచారం చేసేందుకు సిద్ధమవుతోంది. వాస్తవానికి ఎన్నికల కోడ్ ముగిసినంత వరకూ వలంటీర్లతో పింఛన్లను పంపిణీ చేయించవద్దని, నగదు పంపిణీ చేసే ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకాల కార్యక్రమాల్లో వారిని దూరంగా ఉంచాలని కేంద్ర ఎన్నికల కమిషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అయితే, దీనికి కారణం తెలుగుదేశం పార్టీ, మాజీ ఎన్నికల కమిషనర్, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ చైర్మన్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ అని వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారు. వలంటీర్లను దూరం పెట్టాలని టీడీపీయే ఇలా చేసిందంటూ ఆదివారం పలాసలో మంత్రి అప్పలరాజు, ఆమదాలవలసలో స్పీకర్ తమ్మినేని సీతారాం, పలుచోట్ల వైసీపీ నాయకులు తప్పుడు విమర్శలు చేశారు. నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌పైనా ఆరోపణలు చేశారు. వాట్సాప్ గ్రూపుల్లో, స్టేటస్‌ల్లో మెసేజ్‌లు వైరల్ చేస్తూ ప్రతిపక్షాలపై నిందలు మోపుతున్నారు. పత్రికల్లో వచ్చిన కథనాలు, ఫిర్యాదులు, హైకోర్టు తీర్పుకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ వలంటీర్లతో పింఛన్ల పంపిణీ చేయవద్దని ఆదేశించిందని, కానీ వైసీపీ నేతలు టీడీపీయే కారణం అనడం ఏంటని జనాలు మండిపడుతున్నారు. ఇప్పుడే స్వేచ్ఛగా ఉంటుందని.. వలంటీర్ల నిఘా లేకుండా ప్రజలకు పథకాలు అందుతాయని పలువురు అంటున్నారు.


సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ..

సామాజిక పింఛన్లను సోమవారం నుంచి సచివాలయ సిబ్బందే పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉన్న సిబ్బంది అందరూ కలసి సచివాలయాల వద్ద మాత్రమే పింఛన్లు పంపిణీ చేయాలి. పింఛనదారులు ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు తీసుకుని వెళ్లాలి. ముఖ్యమంత్రి ఫొటో ఉన్న పెన్షన్ బుక్ తీసుకురాకూడదు. ఎటువంటి తొక్కిసలాట లేకుండా పింఛన్‌దారుల కోసం జాగ్రత్తలు తీసుకోవాలి. వలంటీర్ల వద్ద ఉన్న మొబైల్, బయోమెట్రిక్ పరికరాలను ఉన్నత అధికారులకు హ్యాండ్‌ఓవర్ చేయాలి. సచివాలయ సిబ్బంది అందరికీ లాగిన్స్ ఇవ్వడం జరుగుతుంది. అందరికీ అన్ని పింఛన్‌దారుల పేర్లు కనిపిస్తాయి. క్లస్టర్ వారీ మ్యాపింగ్ ఉండదని ఆదేశాలు జారీ అయ్యాయి.





నందిగాం: వైఎస్ఆర్ సీసీ సోషల్ మీడియా గ్రూపులో వచ్చిన మెసేజ్



మెళియాపుట్టి: వలంటీర్లకు వాట్సాప్‌లో పంపించిన మెసేజ్

వాట్సాప్ గ్రూపుల్లో తప్పుడు మెసేజ్‌లు

నందిగాం/మెళియాపుట్టి: కేంద్ర ఎన్నికల సంఘం వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని నిలిపివేయడంతో వైసీపీ శ్రేణులు సోషల్ మీడియాలో తప్పుడు మెసేజ్‌లు వైరల్ చేస్తూ ప్రతిపక్షాలపై నిందలు మోపుతున్నారు. నందిగాంలో కొందరు వైసీపీ నాయకులు.. 'రేపు ఉదయం నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు వలంటీర్ల విలువేంటో తెలుస్తుంది. టీడీపీ, జనసేనకు కౌంట్‌డౌన్ మొదలవుతుంది. ప్రతిపక్షాలకు అవ్వాతాతల ఉసురు తగులుతుంది.' అని వాట్సాప్ గ్రూప్‌లో మెసేజ్‌లు పెడుతున్నారు. మెళియాపుట్టి మండలంలో ఓ నాయకుడు పింఛన్ల పంపిణీపై తప్పుడు ప్రచారం నిర్వహించాలని వాట్సాప్ గ్రూప్‌ల్లో మెసేజ్‌లు చేశారు.

చంద్రబాబు నుంచి పిలుపు

- అధినేత వద్దకు గుండ, కలమట వర్గం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

తెలుగుదేశం పార్టీ ఈ దఫా కొన్ని నియోజకవర్గాలను యువతకు కేటాయించింది. ఈ నేపథ్యంలో తొలినుంచీ పార్టీలో ఉంటున్న వారికి సీటు దక్కలేదు. దీంతో పలు చోట్ల అసంతృప్తి జ్వాలలు చెలరేగాయి. శ్రీకాకుళంలో మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు గుండ అప్పల సూర్యనారాయణ సతీమణి గుండ లక్ష్మీదేవి ప్రస్తుతం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్నారు. ఆమెను కాదని జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్‌కు టిక్కెట్ కేటాయించింది అధిష్ఠానం. దీంతో గుండ వర్గం.. అసంతృప్తితో ఉన్నారు. తన వద్దకు రావాలని గుండ అప్పలసూర్యనారాయణ, గుండ లక్ష్మీదేవి, వారి అనుకూల వర్గానికి చంద్రబాబు నుంచి పిలుపు అందింది. ఆదివారం హైదరాబాద్‌కు బయల్దేరి గుండ వర్గం అధినేత వద్దకు వెళ్లారు. అలాగే పాతపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీఎమ్మెల్యే కలమట వెంకటరమణను కాదని మామిడి గోవిందరావుకు టీడీపీ టిక్కెట్ ఇచ్చింది. ఇక్కడ కలమటతోపాటు, అతని వర్గం తీవ్ర అసంతృప్తికి గురైంది. కలమటతో పాటుగా.. ఆయనకు మద్దతుగా ఉన్న వారందరినీ హైదరాబాద్ రావాలని పార్టీ నుంచి పిలుపు అందింది. చంద్రబాబును కలిసేందుకు ప్రత్యేక వాహనంలో కలమటతో పాటుగా టీడీపీ కేడర్ అధికమంది వెళ్లారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు తీసుకునే నిర్ణయం సోమవారం వెలువడనుంది.

అచ్చెన్నకు మాతృ వియోగం

- అనారోగ్యంతో తల్లి కళావతి మృతి
- చంద్రబాబు, లోకేష్ సంతాపం
- నేడు నిమ్మాడలో అంత్యక్రియలు



కళావతి (ఫైల్)

టెక్కలి, మార్చి 31: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆయన తల్లి కళావతి (90) ఆదివారం మధ్యాహ్నం స్వగ్రామం నిమ్మాడలో మృతిచెందారు. వృద్ధాప్యంతో పాటు అనారోగ్యం కారణంగా కళావతి కన్నుమూశారు. దీంతో నిమ్మాడలో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. కళావతి శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీకి నాన్నమ్మ అవుతారు. అచ్చెన్నాయుడు, రామ్మోహన్ ఎన్నికల ప్రచారంలో ఉండగా కళావతి మృతి చెందిన విషయం తెలిసింది. దీంతో వెంటనే ఇంటికి చేరుకున్నారు. ఆమె మృతదేహం వద్ద కుటుంబసభ్యులు, బంధువులు విలపించారు. కాగా, కింజరాపు కళావతి, దాలినాయుడు దంపతులకు ఏడుగురు సంతానం. ఇందులో నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమారుడు దివంగత నేత, కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు. రెండో కుమారుడు కోటబొమ్మాళి పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మూడో కుమారుడు కింజరాపు ప్రభాకర్ డీఎస్పీగా పని చేస్తున్నారు. నాలుగో కుమారుడు టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు. బోర లక్ష్మీ, మెండ ఆదిలక్ష్మి, అంబటి అమ్మాజమ్మ అనే ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కళావతికి మొత్తం 19మంది మనవళ్లు, మనమరాళ్లు ఉన్నారు.

అచ్చెన్నకు చంద్రబాబు ఫోన్

కళావతి మృతి విషయం తెలుసుకున్న టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ కార్యదర్శి యువనేత నారా లోకేష్ తీవ్ర దిగ్భ్రాంతి చెందా రు. ఆమె మృతికి సంతాపం తెలిపారు. అచ్చెన్నాయుడుకు ఫోన్ చేసి ఓదార్చారు. ఈ సమయంలో ధైర్యంగా ఉండాలని చెప్పారు. టీడీపీ సీనియర్ నాయకులు, పొలిట్‌బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యేలు, పలువురు పార్ల మెంట్ సభ్యులు, మాజీ మంత్రులు అచ్చెన్నకు ఫోన్‌చేసి సంతాపం వ్యక్తం చేశారు.

నేడు నిమ్మాడలో అంత్యక్రియలు..

కళావతి అంత్యక్రియలను సోమవారం ఉదయం 8గంటలకు ఎర్రన్న ఘాట్ సమీపంలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లను నిమ్మాడ సర్పంచ్ కింజరాపు సురేష్, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడు, కుటుంబ సభ్యులు పర్యవేక్షిస్తున్నారు.



విషాదవదనంతో అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడు

అమ్మ అంటే అచ్చెన్నకు ప్రాణం..

కింజరాపు కుటుంబానికి కళావతి అమ్మ అంటే ప్రాణం. 1983 నుంచి ఏ ఎన్నికల్లో అయినా నామినేషన్ వేసే ముందు తల్లి కళావతి ఆశీస్సులు తీసుకునే బయలుదేరుతుంటారు. తల్లి మాటను కుమారులైన దివంగత నేత ఎర్రన్నాయుడు, హరివరప్రసాద్, ప్రభాకర్, అచ్చెన్నాయుడు ఏనాడూ జవదాటలేదు. తల్లిచాటు బిడ్డలుగానే ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదుగుతూనే వచ్చారు. అందుకే ఆమె మృతితో కుమారులు బోరున విలపించారు.

అసోం చీఫ్ సెక్రటరీగా జిల్లా వాసి

- బాధ్యతలు చేపట్టిన కోత రవికుమార్



విధుల్లో చేరిన రవికుమార్

టెక్కలి, మార్చి 31: జిల్లాకు చెందిన కోత రవికుమార్ అసోం రాష్ట్ర చీఫ్ సెక్రటరీగా ఆదివారం మధ్యాహ్నం బాధ్యతలు చేపట్టారు. సీనియర్ ఐఏఎస్ రవి స్వగ్రామం సంతబొమ్మాళి మండలం కోటపాడు గ్రామం. ప్రస్తుతం రవి అసోంలో అడిషనల్ చీఫ్ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. 1993 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రవి ప్రాథమిక విద్యాభ్యాసం కొత్తూరు కోటపాడులో జరిగింది. హైస్కూల్ విద్యాభ్యాసం దండుగోపాలపురంలో, ఇంటర్మీడియట్ టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, డిగ్రీ టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివారు. బాపట్లలో ఏజీబీఎస్సీలో సీటు రావడంతో చేరారు. ఆ తరువాత బాపట్లలోనే అగ్రికల్చర్ ఎమ్మెస్సీ, కొన్నాళ్ల తరువాత ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (న్యూఢిల్లీ)లో పీహెచ్‌డీని పూర్తిచేశారు.

అసిస్టెంట్ కమిషనర్ స్థాయి నుంచి..

కోత రవి తన మొదటి పోస్టింగ్ కింద అసోంలోని గొసాయిగాంలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధుల్లో చేరారు. ఆ తరువాత జ్వరాఘాట్, సివసాగర్ జిల్లాల్లో కలెక్టర్‌గా పనిచేశారు. అలాగే అసోంలో అగ్రికల్చర్ జాయింట్ సెక్రటరీగా, న్యూఢిల్లీలోని మానవ వనరుల శాఖ, మైన్స్ శాఖల మంత్రుల వద్ద ఓఎస్‌డీగా పనిచేశారు. సౌత్ ఇండియాలో ఎఫ్‌సీఐలో సీనియర్ రీజనల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం అమెరికాలో మినిస్ట్రీ ఆఫ్ ఎకనమిక్స్ విభాగంలో అంతర్జాతీయ ద్రవ్యనిధి ప్రతినిధిగా పనిచేశారు. అసోం ప్రాంతంలో ఐఏఎస్‌గా ఎక్కువకాలం విధులు నిర్వహించడం వలన ఆ ప్రాంత ప్రజానీకంతో అనుబంధం ఏర్పడింది. అస్సాం ప్రభుత్వం తరఫున ఉల్ఫా తీవ్రవాదులతో చర్చలు జరపడంలో ఆయన కీలక భూమిక పోషించారు. జ్వాలాగాట్‌లో ప్రజల భాగస్వామ్యంతో ఆసుపత్రి, జైలు నిర్మాణం చేయించి డబుల్ రోడ్లు, సోడియం వేపర్ లైటింగ్స్ ఏర్పాటు చేశారు. బ్రహ్మపుత్ర నదిపై ఆరువేల కోట్ల రూపాయల ప్రపంచబ్యాంక్ నిధులతో వంతెన నిర్మాణానికి కృషి చేశారు. రవి సోదరులు భీమారావు హైకోర్టు న్యాయవాదిగా పనిచేస్తుండగా, మరో సోదరుడు మధు కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు.

పోలీసుల దాష్టీకం

- ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ డ్రైవర్‌పై దాడి
- రాజకీయ కక్షతోనే అంటున్న బాధితుడు
- నలుగురిపై కేసు నమోదు



గాయపడిన దేవరాజు

హరిపురం, మార్చి 31: మందస మండలం బుడార్సింగి గ్రామ సమీపంలో ఆదివారం వేకువజామున ఆర్టీసీ అవుట్‌సోర్సింగ్ డ్రైవర్ (హైర్‌బస్) గాడి దేవరాజుపై సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులు దాడిచేశారు. బాధితుని కథనం మేరకు.. గౌడగురంటి గ్రామానికి చెందిన దేవరాజు విధుల్లో భాగంగా ఇంటినుంచి పలాస డిపోకు తన ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో బుడార్సింగి సమీపంలో కొందరు వ్యక్తులు ఆయన ద్విచక్ర వాహనాన్ని ఆపి కర్రలతో ముఖంపై దాడి చేశారు. దాడికి పాల్పడిన వారంతా సివిల్ డ్రెస్‌లో ఉన్న పోలీసులు కావడంతో ఏమి చేయాలో తనకు తెలియలేదని దేవరాజు తెలిపాడు. కేకలు వేసి గ్రామానికి చేరుకోవడంతో స్థానికులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. అప్పటికే దేవరాజుకు ముఖంపై తీవ్ర గాయాలై రక్తస్రావం కావడంతో హరిపురం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్ ఎస్.రవికుమార్, సీపీవోలు సంతోష్‌కుమార్, కేశవరావు, కృష్ణారావుపై ఎస్ఐ అనీల్‌కుమార్ కేసు నమోదు చేశారు. శాఖాపరమైన చర్యల కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్లు ఎస్ఐ తెలిపారు.



బాధితుడిని పరామర్శిస్తున్న గౌతు శిరీష

పార్టీ మారడంతో కక్ష..

గత ఎన్నికల్లో వైసీపీకి మద్దతు తెలిపిన తమ కుటుంబమంతా ఆరు నెలల కిందట పలాస టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష సమక్షంలో ఆ పార్టీలో చేరినట్లు బాధితుడు గాడి దేవరాజు తెలిపాడు. దీంతో సర్పంచ్ సురేష్‌పాణిగ్రాహి పలుమార్లు హెచ్చరించారని, ఇప్పుడు పోలీసులతో తనపై దాడి చేయించారని వాపోయాడు. స్థానికులు రాకుంటే తనను అంతం చేసేవారని భయాందోళన వ్యక్తం చేశాడు. హరిపురం ప్రభుత్వా సుపత్రిలో చికిత్స పొందుతున్న దేవరాజును టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష, నాయకులు బావన దుర్యోధన, దాసరి తాతారావు, రట్టి లింగరాజు, పుల్లా వాసు, బైరిశెట్టి గున్నయ్య తదితరులు పరామర్శించారు. పార్టీ మారిన దేవరాజుపై దాడులకు పాల్పడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వైసీపీ దాడులకు భయపడేదని లేదని, బాధితులకు తమ అండదండలు ఉంటాయని భరోసానిచ్చారు.

రాజకీయ దాడి కాదు: ఎస్ఐ

దేవరాజుపై పోలీసుల దాడి రాజకీయంగా చేసింది కాదని ఎస్ఐ అనీల్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సారా అక్రమ రవాణాపై సమాచారం అందడంతో పోలీసులు పహారా కాశారని, ఆ సమయంలో దేవరాజు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆపినట్లు చెప్పారు. దీంతో అతను పోలీసులతో వాగ్వాదం చేయగా దాడి జరిగినట్లు గుర్తించామన్నారు. దీనికి కారణమైన పోలీసు సిబ్బందిపై కేసు నమోదు చేసి శాఖాపరమైన చర్యల కోసం పైఅధికారులకు రిపోర్ట్ చేసినట్లు తెలిపారు.



ఘనంగా ఈస్టర్ వేడుకలు

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 31: జిల్లాలో ఈస్టర్ వేడుకలను ఆదివారం క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. తెల్లవారుజామున నుంచే చర్చిల్లో ప్రార్థనలు చేశారు. క్రీస్తు పునరుత్థానం చెందిన మహోన్నత రోజు ఈస్టర్ అని క్రైస్తవుల నమ్మకం. ఈ సందర్భంగా శ్రీకాకుళం నగరంలోని సహాయ మాత చర్చి, బాప్టిస్టు చర్చి ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారు జామునుంచే సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రభు కోసం ప్రత్యేక కీర్తనలు ఆలపించారు.

అప్పులు తీర్చేందుకు దోపిడీ

- బంగారం చోరీ కేసును ఛేదించిన పోలీసులు
- 25 తులాలు స్వాధీనం.. ఇద్దరు అరెస్టు


శ్రీకాకుళం క్రైం, మార్చి 31: వారిద్దరూ చెడు వ్యసనాలకు బానిసలై అప్పులు చేశారు. ఈ అప్పును తీర్చేందుకు దోపిడీ చేయగా పోలీసులకు పట్టుబడ్డారు. శ్రీకాకుళం నగరంలోని బొంతవారి వీధిలో గత నెల 2న జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి వారి నుంచి 25 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను శ్రీకాకుళం సబ్ డివిజనల్ కార్యాలయంలో ఆదివారం డీఎస్పీ వై.శృతి విలేఖరులకు వెల్లడించారు. ఆమె వివరాల మేరకు.. ఖమ్మం జిల్లా భద్రాచలానికి చెందిన చల్లా జంపన్న, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటిపాక మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన పొడుతూరి సాంబశివరావు ఆన్‌లైన్ జూదంలో పరిచయమయ్యారు. ఇద్దరూ పేకాట, బెట్టింగ్‌లు, చెడు వ్యసనాలకు బానిసలై అప్పుల పాలైయ్యారు. దీంతో దొంగతనం చేసి సులువుగా డబ్బులు సంపాదించాలనుకునేవారు. ఈ క్రమంలో ఓ జ్యోతిష్యుడిని కలవగా.. శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారిని దర్శించుకుంటే సమస్యలు తీరుతాయని చెప్పారు. దీంతో ఆరు నెలల క్రితం శ్రీకాకుళం వచ్చి ఆదిత్యుని దర్శించుకున్నారు. తిరిగి ఆటోలో వెళ్తుండగా అదే ఆటోలో ప్రయాణిస్తున్న బొంతవారి వీధికి చెందిన బమిడిపాటి జగదాంబ అనే వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారాన్ని చూశారు. ఆ బంగారాన్ని దొంగిలించి అప్పులు తీర్చాలని భావించారు. దీంతో ఆ వృద్ధురాలికి సహాయం చేస్తున్నట్లు నటించారు. ఆమె వస్తువులను మోసుకుంటూ ఇంటి దగ్గర దించి మాటకలిపారు. ఇంటిలో ఎవరెవరు ఉంటున్నారు, ఏం చేస్తున్నారో తెలుసుకున్నారు. ఐదు నెలల పాటు రిక్కీ నిర్వహించారు. పక్కా పథకం ప్రకారం గత నెల 2న జగదాంబ ఇంట్లోకి చొరబడి ఆమెను తాళ్లతో కట్టేసి, నోట్లో గుడ్డలు కుక్కి ఒంటిపై ఉన్న 25 తులాల బంగారు ఆభరణాలను దోపిడీ చేసి పరారయ్యారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ఎల్.సన్యాశినాయుడు, ఎస్ఐ గణేష్, క్రైం సిబ్బంది నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దోచుకున్న బంగారాన్ని నిందితులు ఓ ఫైనాన్స్ సంస్థలో కుదువ పెట్టారు. అయితే, ఈ విషయం పోలీసులకు తెలుస్తుందని భావించి బంగారాన్ని విడిపించేశారు. అనంతరం 25 తులాలను కరిగించి వాటాలు వేసుకున్నారు. నిందితులు గత 17న శ్రీకాకుళం వచ్చి వారు దొంగతనం చేసిన ఇంటి పక్కవారిని కలిశారు. వృద్ధురాలికి ఎలా ఉంది, దొంగతనం కేసులో పోలీసులు ఏమి అడిగారని ఆరా తీశారు. ఆదివారం మరోసారి శ్రీకాకుళం రాగా అప్పటికే ఉమారుద్రకోటేశ్వర స్వామి ఆలయం వద్ద మాటువేసిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు. వారిని విచారించగా నేరం చేసినట్లు అంగీకరించడంతో అరెస్టు చేశారు. ఒకరి నుంచి 150 గ్రాములు, మరొకరి నుంచి 141 గ్రాముల బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో శ్రీకూర్మం నుంచి శ్రీకాకుళం నగరంలోని అన్ని సీసీ కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించామని, సాంకేతికత సహాయంతో నిందితులను పట్టుకున్నట్లు డీఎస్పీ వివరించారు. కేసు ఛేదించిన సీఐ, ఎస్ఐ, క్రైం కానిస్టేబుళ్లను అభినందించారు. క్రైం కానిస్టేబుళ్లు ఎస్.రవికుమార్, సీహెచ్.హరీష్ కుమార్, ఆర్.సూరిబాబు, డి.తులసిలకు రివార్డులు అందజేశారు.



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శృతి

బోరు వేశారు కనెక్షన్ మరిచారు!

- అసంపూర్తిగా నిలిచిన నిర్మాణాలు
- ఇదీ జగనన్న ఇళ్ల కాలనీ దుస్థితి


మౌలిక వసతులు లేక అసంపూర్తిగా ఉన్న సీతారాంపల్లి జగనన్న కాలనీ


బోరుకు కనెక్షన్ ఇవ్వకుండా వదిలేసిన దృశ్యం

(పాతపట్నం)

జగనన్న ఇళ్ల కాలనీలంటూ గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆ కాలనీల్లో కనీస సదుపాయాలు మృగ్యమవుతున్నాయి. మండల పరిధిలోని సీతారాపురం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన జగనన్న ఇళ్ల కాలనీలో నీటి సదుపాయం లేకపోవడంతో నిర్మాణాలు అర్థంతరంగా నిలిచిపోయాయి. సీతారాంపురం, పెద్దలోగిడి, బోరుభద్ర గ్రామాలకు చెందిన 68 మంది లబ్ధిదారులకు ఇక్కడ స్థలాలను కేటాయించారు. పట్టాలిచ్చి స్థలాలు చూపించడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించారు. అయితే నిర్మాణాలకు ముందే కనీస సదుపాయాల కల్పన చేయాల్సి ఉన్నా ఏదో నామమాత్రంగా మమ అనిపించారు తప్ప పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలేదు. రోడ్ల నిర్మాణం లేకపోగా కనీసం నీటి సదుపాయం ఏర్పాటు చేయకపోవడంతో ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బందులు పడుతున్నామని లబ్ధి దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు ఏర్పాటు చేసినప్పటికీ విద్యుత్ కనెక్షన్ ఇవ్వకపోవడంతో నీరు లేక నిర్మాణాల్లో జాప్యం జరుగుతోందని వాపోతున్నారు. ఈ సమస్యపై అనేక పర్యా యాలు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంతవరకు సీతారాంపల్లి పంచాయతీ రక్షిత నీటి పథకానికి అనుసంధానంగా ఉన్న బోరు నుంచి నీటిని వినియోగించారు. మార్చి మొదటి వారానికే భూగర్భ జలాలు అడుగంటడంతో ఆ బోరు నుంచి చుక్క నీరు రావడం లేదని వారు పేర్కొంటున్నారు. కాలనీల్లో అన్ని సదుపా యాలు కల్పిస్తున్నామని అధికారులు, నేతలు హడావుడి ప్రకటనలు తప్ప క్షేత్ర స్థాయిలో వాటి ఫలాలు కనిపించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. రోడ్లు లేక, నీటి సదుపాయం లేక ఇళ్లను పూర్తి చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కనెక్షన్ నిమిత్తం డీడీ కట్టాం

ఎన్నికల కోడ్ రాకముందే విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ శాఖకు డీడీ కట్టాం. అదనంగా మరో స్తంభం అవసరవుతుందని సంబంధిత అధికారులు తెలిపారు. వారు ప్రతిపాదనలు ఇస్తే దానికి అవసరమైన మొత్తం కడతాం. వారు కనెక్షన్ ఇచ్చిన తరువాత నీటి సదుపాయం కల్పనకు చర్యలు తీసుకుంటాం.

-కల్యాణ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

‘సీఎం జగన్ నిర్ణయంతో ఖజానా ఖాళీ’

నరసన్నపేట: ప్రతి నెలా ఒకటో తేదీన పంపిణీ చేయాల్సిన సామాజిక పింఛన్ల మొత్తాన్ని సీఎం జగన్ తన సొంత కాంట్రాక్టర్లకు ఇవ్వడంతో ఖజానా ఖాళీ అయిందని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిని కప్పిపుచ్చుకునేందుకు ఎన్నికల కమిషన్‌పైనా, నిమ్మగడ్డ రమేష్ కుమార్‌పైనా దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగులు ద్వారా పింఛన్లను పంపిణీ చేయాలని ఆయన కోరారు.

వలంటీర్లపై విషం చిమ్ముతున్నారు: మంత్రి

పలాస: వలంటీర్లపై టీడీపీ నేతలు విషం చిమ్ముతున్నారని మంత్రి సీదిరి అప్పలరాజు విమర్శించారు. ఆదివారం ప్రగతి భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. వలంటీర్ల పై మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు మేరకు కమిషన్ వలంటీర్లతో పింఛన్ పంపిణీ నిలిపి వేయాలని ఆదేశించిందన్నారు. టీడీపీ అధినేత చంద్ర బాబుకు రమేష్ కుమార్ తొత్తుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇంటింటికీ పింఛన్లు అందించే వలంటీర్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం


పాపారావు, అమృతవేణి దంపతులకు సన్మానం

వజ్రపుకొత్తూరు: మెరుగైన సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైనదని టెక్కలి జయపురం హైస్కూల్ వైస్ ప్రిన్సిపాల్ మూల తాతయ్య అన్నారు. ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ముంజేటి పాపారావు పదవీ విరమణ కార్యక్రమం ఆదివారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పాపారావు, అమృతవేణి దంపతులను శిష్యులు, బంధువులు, మిత్రు లు సత్కరించారు. డాక్టర్ ఎం.మల్లేశ్వరరావు, పలాస రిటైర్డ్ ఎంఈవో పైల కృష్ణప్రసాద్, రిటైర్డ్ కామర్స్ అధ్యాపకుడు మజ్జి పున్నయ్య మాట్లాడుతూ.. పాపారావు మాస్టారు విద్యాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.ప్రసాదరావు, గేదెల జయరామ్, గేదెల నరేష్, గేదెల శ్యామలరావు, గున్న బాలకృష్ణ, గేదెల కార్తీక్, పాలవలస వైకుంఠరావు, దాసరి సత్యారావు, అక్కుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి విజయకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పాపారావు మాస్టారు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది


బాలకృష్ణ దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

పలస రూరల్: ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని పలాస ఎంఈవో సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. నీలిభద్ర ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉద్యోగ విర మణ చేసిన తమ్మినేని బాలకృష్ణ, వనజాక్షి దంపతులను ఆదివారం పాఠశాల ఆవరణలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన ఘనత బాలకృష్ణకు దక్కుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థుల సమక్షంలో బాలకృష్ణ దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం పాపారావు, బి. కాంతారావు, ఎం.భవానీ, డి.వరప్రసాదరావు, ఏపీటీఎఫ్ ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

‘జయహో బీసీ’

పలాసరూరల్: పలాస మండలానికి చెందిన జయహో బీసీ కార్యక్రమం ఆదివారం టీడీపీ మండల అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణకుమార్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో మండల నాయకులు ఎం.కుమారరాజా, హరియా మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నకు మాతృ వియోగంపై సంతాపం

నందిగాం: టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నా యుడు తల్లి కళావతి మృతిచెందడంపై టీడీపీ మండల నాయకులు సంతాపం తెలిపారు. నేతలు పి.అజయ్ కుమార్, పి.చంద్రశేఖర్, ఎం.బాలకృష్ణ, టి.ఉమామహేశ్వరరావు, మదన్‌గౌడ్, గిరిబాబు, కె.ప్రసాదరావు తదితరులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఘనంగా ధనరాజ తులసమ్మతల్లి సంబరం


అమ్మవారి ఘటాలతో మహిళలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో ధనరాజ తులసమ్మతల్లి సంబరం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన మహిళలు అమ్మవారి ఘటాలు, పానకాల కుండలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

గుర్రపు డెక్కతో అవస్థలు

మందస: మందస జెన్నాయి చెరువు సాగునీటికి ఉపయోగపడాల్సి ఉన్నప్పటికీ గుర్రపు డెక్కతో నిండిపోయింది. దీంతో ఎందుకు పనికిరాకుండా ఉంది. అయితే సాగునీటికి రైతులకు ఉపయోగపడాల్సిన చెరువు అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుర్రపు డెక్కలను తొలగించి చెరువును అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుకొని రావాలని రైతులు కోరుతున్నారు.


జెన్నాయి చెరువులో గుర్రపు డెక్క

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి : ఎంపీ


యువ ఓటర్లతో మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, (సారవకోట) : టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమం సాధ్యమని ఎంపీ, ఉమ్మడి అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. సవరడ్డపనస టీడీపీ కార్యాలయంలో ఆదివారం 18 ఏళ్లు నిండి ఓటు హక్కు పొందిన యువతతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. ఉద్యోగాలు రాక నిరుద్యోగులు వీధి పడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలి పించడం ద్వారా పరిపాలన అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని గాడిలో పెట్టి యువతకు బాసటగా నిలుస్తారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రతినిధి ధర్మాన తేజకుమార్, సారవకోట, జలుమూరు మండలాల టీడీపీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, వెలమల రాజేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి: బగ్గు

నరసన్నపేట: రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడే నాయకులను ఎన్నుకోవాలని ఉమ్మడి పార్టీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. ఆదివారం పట్టణంలో బైరాగివీధి, భవానీపురం, కొత్త వీధి, నాయుడు వీదుల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. కళింగ కోమట్లను బీసీలోకి చేర్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. అవినీతిపరులను ఓటుహక్కు ద్వారా తరిమికొట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, నాయకులు గొద్దు చిట్టిబాబు, కింజరాపు రామారావు, ఉణ్న వెంకటేశ్వరరావు, నేతింటి విశ్వేశ్వర రావు, జామి వెంకట్రావు, పీస కృష్ణ, బోయన సతీష్, బలగ ప్రహర్ష, జనసేన నియోజకవర్గ కన్వీనర్ బలగ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో మెట్టూరు ఎంపీటీసీ సభ్యురాలి చేరిక


శివాజీ సమక్షంలో టీడీపీలో చేరిన ఎంపీటీసీ సభ్యురాలు సురేఖ, అనుచరులు

పలాస/వజ్రపుకొత్తూరు, మార్చి 31: వజ్రపుకొత్తూరు మండలం మెట్టూరు వైసీపీ ఎంపీటీసీ సభ్యురాలు కె.సురేఖతో పాటు ఆమె అనుచరులు 30 మంది ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. ఆదివారం వారికి మాజీమంత్రి గౌతు శ్యామ సుందర శివాజీ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన ఎంపీటీసీ సభ్యురాలు మాట్లాడుతూ.. ఎంపీటీసీగా గెలుపొందినా తన ప్రాంతాన్ని అభివృద్ధి చేసు కోలేకపోయానన్నారు. శిరీష విజయానికి పాటుపడతామన్నారు. టీడీపీలో చేరిన వారిలో రాజేశ్వరి, సుజాత, రేణుక, ధనలక్ష్మి, శ్రీదేవి, త్రినాథ మ్మ, సావిత్రి, చిరంజీవి, నిఖిల్, భోగిరాజుఉన్నారు. దువ్వాడ హేమబాబు చౌదరి, శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

అధిక మెజార్టీతో గెలిపించండి: శిరీష


టీడీపీలో చేరిన నాయకులతో గౌతు శిరీష

పలాస/హరిపురం: మందస మండలం లోహరి బంద గ్రామానికి చెందిన 30 కుటుం బాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. ఆదివారం వీరికి పలాస టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష పార్టీ కండు వాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో శిరీష అధిక మెజార్టీతో గెలుపొందేలా కృషి చేస్తామన్నారు. టీడీపీలో చేరిన వారిలో వి.రామారావు, వి.గణపతి, తాళ్ల లక్ష్మణ రావు, గొరకల భాస్కర రావుతో పాటు పలువురు గ్రామస్థులున్నారు. ఈ సందర్భంగా శిరీష మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. దాసరి తాతారావు,బావన దుర్యోధన, రుద్రయ్య పాల్గొన్నారు.

ఒడియా కళాకారులకు గుర్తింపు కార్డులు


గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఒడియా కళాకారుల సంఘ నాయకులు

కంచిలి: కుమ్మరి నౌగాం పంచాయతీ పరిధిలో లక్ష్మీపురం లిమ్మేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం ఒడియా కళాకారుల మహా సంఘం ప్రాం తీయ సమావేశం ఖగేశ్వరరావు అధ్యక్ష తన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో నివాసముం టున్న ఒడి యా కళాకారులకు గృహ వసతి, కళా కారులకు పెన్షన్, విద్యార్థులకు ఒడియా పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఇవ్వాలని, మృదంగం, కంజీర, డోలక్, హార్మోనియం, పరికరాలు ఇవ్వాలని ప్రభుత్వానికి నివేదిక అందించేందుకు తీర్మానించారు. అనంతరం 46 మంది ఆంధ్రాలో నివాసముంటున్న ఒడియా కళాకారులకు గుర్తింపు కార్డులను అందజే శారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తిరుపతిసాహు, సురేష్‌కుమార్, కుమార్‌నాయక్, సుబాష్ రోసన్ సాహు పాల్గొన్నారు.

అధికారుల వేధింపులు ఆపాలి

- ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి


మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

అరసవల్లి: ఆశ వర్కర్లపై జిల్లా అధికారుల వేధింపులను వెంటనే ఆపాలని పోరాటాన్ని ఉధృతం చేస్తామని ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి హెచ్చరించారు. జిల్లా యూనియన్ విస్తృత స్థాయి సమావేశం నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో ఆశ కార్యకర్తలు వివిధ రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు ఆశ వర్కర్లను బానిసలుగా చూస్తున్నారని, సబ్ సెంటర్లు, విలేజ్ హెల్త్ క్లినిక్ క్లీనింగ్ పనులకు ఆశ వర్కర్లను పురమాయిస్తున్నారన్నారు. ప్రతీరోజు ఉదయం 9 గంటలకు వచ్చి సాయంత్రం 4 గంటల వరకు సెంటర్లో కూర్చోవాలని చెప్పడం, రికార్డుల్లో సంతకాలు చేయాలని చెప్పడం సరికాద న్నారు. ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్స్ అమలు చేయాలని, దహన సంస్కారాలకు ఆర్థిక సాయంగా రూ.20,000 ఇవ్వాలని తదితర వాటిని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, ఆశ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్య క్షులు కె.నాగ మణి, నాయకులు జి.అమరావతి, కె.లక్ష్మి, జి.కృష్ణవేణి, ద్రౌపది, ప్రేమలత, తదితరులు పాల్గొన్నారు.

కంద్రవీధిలో కార్డెన్ సెర్చ్


సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలు

టెక్కలి: టెక్కలి కంద్రవీధిలో ఆదివారం వేకువజామున సీఐ పి. పైడయ్య ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. దీంతో స్థానికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ప్రత్యేక పోలీస్ బలగాలు ఇంటింటికీ వెళ్లి సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఎస్ఐలు లక్ష్మి, వారణాసి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏసు పునరుత్థాన దినోత్సవం



పాతపట్నం: రన్ ఫర్ జీసెస్ ప్రదర్శన నిర్వహిస్తున్న క్రైస్తవులు


పొత్రియ గ్రామంలో ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

పాతపట్నం: ఏసు పునరుత్థాన దినోత్సవం సందర్భంగా ఆదివారం పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో రన్ ఫర్ జీసెస్ కార్యక్రమం పేరిట ప్రధాన రహదారులపై ర్యాలీ చేపట్టారు. స్థానిక జేసీపీఈఎం చర్చిలో పాస్టర్ జి. ప్రసాద్ మాట్లాడుతూ.. మానవాళి పాప నివృత్తి కోసం మరణించి, తిరిగి లేచిన ఏకైక దేవుడు ఏసు అని అన్నారు. పాతపట్నం, రొంపివలస, బూరగాం, కొరసవాడ, తెంబూరు, గంగువాడ, బడ్డుమర్రి, సీది, సోద, ఏఎస్‌కవిటి తదితర గ్రామాల్లోని చర్చిల్లోనూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పలు గ్రామాల్లో..

పలాసరూరల్: మండలంలోని దానగొర, హిమగిరి, పొత్రియ గ్రామాల్లోని చర్చిల్లో ఆది వారం ఈస్టర్ వేడుకల సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా క్రీస్తు బోధనలను పాస్టర్లు వివరించారు. కార్యక్రమంలో ఫాదర్ సవర జగన్నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి



సవరరామకృష్ణాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నందిగాం: ఓటుహక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యం నింపేందుకు ఆదివారం పలు గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించారు. సవర రామకృష్ణాపురం, కల్లాడ, దిమ్మిడిజోల, దీనబంధుపురం తదితర గ్రామాల్లో చైతన్య ర్యాలీలు చేపట్టారు. కార్యక్రమంలో మండల ఎన్‌సీసీ అధికారి జి.శివప్రసాద్, పంచాయతీల కార్యదర్శులు కె.సంతోష్‌కుమార్, డిల్లేశ్వరరావు, వెలుగు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



సుభలయ ఆర్ఆర్ కాలనీ చైతన్య ర్యాలీ

ఓటు హక్కు వినియోగంపై అవగాహన

హిరమండలం: మండలంలోని పలు పంచాయతీల్లో ఆదివారం ఓటుహక్కు వినియోగంపై సచివాలయ ఉద్యోగులు అవగాహన కల్పించారు. అనంతరం చైతన్య ర్యాలీలు నిర్వహించారు. భవిష్యత్తును నిర్ణయించే సాధనం ఓటు అని, దీనిని ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలు మహిళా సంఘాల ప్రతినిధులు, వెలుగు సిబ్బంది, పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సాయం

పొందూరు: గార పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన పొందూరు మండలం పిల్లలవలసకు చెందిన కానిస్టేబుల్ బూర సురేష్ కుటుంబానికి ఆదివారం రూ.లక్ష అందించారు. ఎస్పీ జి.రాధిక ఆదేశాల మేరకు పిల్లలవలసలో సురేష్ భార్య పద్మావతికి జిల్లా పోలీస్ అసోసియేషన్ తరపున డెత్ రిలీఫ్ ఫండ్ నుంచి అసోసియేషన్ ప్రతి నిధులు ఆర్.కృష్ణంనాయుడు, భుజంగరావు, కె.రాధాకృష్ణ చెక్కును అందించారు.


చెక్కును అందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అమ్మవారిని దర్శించుకున్న బగ్గు

దీర్ఘాశి(పోలాకి): నరసన్నపేట నియోజకవర్గ ఉమ్మడి టీడీపీ అభ్యర్థి బగ్గు రమణమూర్తి ఆదివారం దీర్ఘాశి దుర్గాగిరి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రెండు రోజు లుగా నిర్వహి స్తున్న ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు.





అతిథి గృహం లేదాయే!

- శిథిలమైన బ్రిటిష్ కాలంనాటి భవనాలు
- వీఐపీలకు వేధిస్తున్న వసతి సమస్య
- పట్టించుకోని యంత్రాంగం


పెచ్చులూడుతున్న దృశ్యం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ పరిధి జంక్షన్‌లో ఉన్న ఆర్‌అండ్‌బీ అతిథిగృహం శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారింది. ఈ అతిథి గృహం బ్రిటీష్ వారి హయాంలో నిర్మించారు. పదేళ్ల కిందటి వరకు ఎంతోమంది ప్రజా ప్రతినిధులు, వీఐపీలు సేద తీర్చేందుకు అవకాశం కల్పించిన ఈ అతిథి గృహం నిరుపయోగంగా మారిపోయింది. లోపల స్లేబ్ కూలి ప్రమాదకరంగా మారినా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ అతిథి గృహాన్ని మరమ్మతులు చేయించడం గాని, తొలగించి కొత్తది నిర్మించడం గాని చేపట్టలేదు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అతిథి గృహాలను మరమ్మతులు చేసేందుకు నిధులు మంజూరుకు సిద్ధమైంది. ఈ క్రమంలో ఎన్నికల షెడ్యూల్ రావడం ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చింది. దీంతో అతిథి గృహాలను పట్టించుకొనే నాథుడే కరువయ్యాడు. సుమారు నాలుగు ఎకరాల స్థలంలో ఉన్న ఈ అతిథి గృహంలో ఒక ఎకరా స్థలాన్ని బాలికల జూనియర్ కళాశాలకు కేటాయించారు. మిగతా స్థలం నిరుపయోగంగానే ఉంది. శిథిలావస్థలో ఉన్న ఈ బంగ్లాను తొలగించి కొత్త నిర్మాణం చేపడితే ఎంతోమందికి ఉపయోగకరంగా ఉండేది. స్థానిక ప్రజా ప్రతినిధులు సైతం ఈ అతిథి గృహం అభివృద్ధి పట్టకపోవడం దురదృష్టకరం. ప్రభుత్వం కార్యక్రమాలకు అతిథులు వచ్చినపుడు వారి విడిదికి అతిథి గృహం అందుబాటులో లేకపోవడంతో ప్రైవేట్ హోటళ్లల్లో బస చేయాల్సి వస్తుంది. ఇప్పుడు మళ్లీ ఎన్నికల సీజన్ ప్రారంభమైంది. ఈ సమయంలో ఎన్నికల పర్యవేక్షకులు జిల్లా ఉన్నతాధికారులు పర్యటిస్తారు. నియోజకవర్గ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న ఏకైక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం మూలకు చేరడంతో స్థానిక హోటళ్లల్లోనే వీఐపీలు ఉండాల్సి వస్తుంది. 2013-14 సంవత్సరంలో రాష్ట్ర విభజనకు ముందు మరమ్మతులకు రూ.50 లక్షలు అంచనాలు వేసి అప్పటి ఆర్‌అండ్‌బీ అధికారులు నివేదికలు పంపించారు. రాష్ట్ర విభజన తర్వాత ఆగిపోయింది. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులకు వివరణ కోరగా.. భవనం పూరిగా శిథిలావస్థకు చేరినందున తొలగించడం కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని చెబుతున్నారు.


శిథిలమైన ఆర్‌అండ్‌బీ బంగ్లా


బంగ్లా స్లేబ్ కూలిన గది

ప్రతిపాదనలు పంపించాం

డివిజన్ పరిధిలనాలుగు ఆర్ అండ్‌బీ బంగ్లాల్లో ఇచ్ఛాపురం, పలాస అతిథి గృహాలు శిథిలావస్థకు చేరాయి. సోంపేట, టెక్కలి అతిథి గృహాలు మరమ్మతులకు గురయ్యాయి. ఆరు నెలల కిందట రాష్ట్ర బృందం వచ్చి టెక్కలి డివిజన్ పరిధిలో గల నాలుగు ఆర్‌అండ్‌బీ బంగ్లాలను పరిశీలించారు. శిథిలావస్థలో ఉన్న ఇచ్ఛాపురం, పలాస అతిథి గృహాలను తొలగించి కొత్తగా నిర్మించేందుకు, సోంపేట, టెక్కలి అతిథి గృహాలను మరమ్మతులు చేయించేందుకు అంచనాలు వేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించారు.

- డి.మోహన్‌రావు, ఆర్‌అండ్‌బీ ఏఈ

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు


సవర వినోద్

పలాస రూరల్: పలాస మండలం తర్లాకోట పంచాయతీ బాలాజీపూరుకు చెందిన సవర వినోద్ (31) ఈనెల 13వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తండ్రి సవర లచ్చయ్య కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కాశీబుగ్గ ఏఎస్ఐ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరికైనా అతని ఆచూకీ లభ్యమైతే లచ్చయ్య 6303320349 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు


పొలాల్లోకి వెళ్లిపోయిన కారు

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి పాలేశ్వరస్వామి ఆలయ సమీపంలో ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారి మధ్యలో ఉన్న గొయ్యిని తప్పించబోయి కారు పొలాల్లోకి దూసుకుపోయింది. అయితే ఇందులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు. ఇటీవల గ్యాస్ పైప్‌లైన్ కోసం రోడ్డు తవ్వారు. ఈ నేపథ్యంలో రోడ్డు మధ్యలో గొయ్యి ఏర్పడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అటు ఆర్‌అండ్‌బి అధికారులు కాని ఇటు గ్యాస్ కంపెనీ సిబ్బంది గాని స్పందించడం లేదని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బెల్లం ఊట ధ్వంసం


పట్టుబడిన సామగ్రితో పోలీసులు

మెళియాపుట్టి: మండలంలోని రింపి, మూల రింపి, మూల ముకుందపురం గ్రామాల్లో పోలీసులు, ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి 2000 వేల లీటర్ల లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. పోలీసుల దాడిలో 600 లీటర్ల బెల్లం ఊటలు, 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్ఈబీ అధికారుల దాడుల్లో 1400 లీటర్లు బెల్లం ఊటలతో పాటు 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో సారా తయారీ చేసే వ్యక్తులపై, బెల్ల సరఫరా చేసే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ దాడుల్లో పాతపట్నం సీఐ నల్లి సాయి, ఎస్ఈబీ అధికారుల్లు రాజశేఖర్ నాయుడు, రామచంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా ఎన్నాళ్లు?


బందరువానిపేటలో వదిలేసి శిలాఫలకం

గార: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి రెండు వారాలైనా ఇంకా చాలా చోట్ల శిలాఫలకాలు అలానే కనిపిస్తున్నాయి. సముద్ర తీర ప్రాంత గ్రామం బందరువానిపేట హైస్కూల్ ఎదురుగా నా భూమి - నా దేశం పేరుతో ఏర్పాటు చేసిన ఫలకంపై ఎటువంటి కాగితాలు అంటించకపోవడంతో పలువురు అధికారుల తీరును విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కూర్మనాథ ఆలయంలో పూజలు


స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు

గార: ప్రసిద్ధ కూర్మనాథుని ఆలయం వద్ద ఆదివారం భక్తులు పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలు నుంచి వచ్చిన భక్తులు పూజలు చేసి, తాబేళ్ల పార్కు, శ్వేత పుష్కరిణి దర్శించుకున్నారు. ఆలయ ఈవో గురునాథరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ఆలయ పునఃప్రారంభోత్సవం


ఊరేగిస్తున్న రంగనాథ స్వామి విగ్రహం

ఎచ్చెర్ల: ఫరీద్‌పేటలో పునర్నిర్మాణం జరిగిన రంగనాథ స్వామి ఆలయ ప్రారంభోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ పురవీధుల్లో భక్తిశ్రద్ధల నడుమ రంగనాథుని విగ్రహాన్ని ఊరేగించారు. సాధారణంగా ఉత్సహ విగ్రహాలను మాత్రమే తిరువీధి నిర్వహిస్తారు. అయితే పునఃప్రతిష్ఠ కారణంగా శేషపాన్పుతో ఉన్న మూల విరాట్ తిరువీధిలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కోలాటం, జానపద నృత్యాలు, తప్పెటగుళ్ల భజన కార్యక్రమాలతో కోలాహలంగా ఈ కార్యక్రమం జరిగింది. ఏప్రిల్ 4న స్వామి వారి విగ్రహాన్ని పునఃప్రతిష్ఠిస్తారు.

ఆదిత్యుని ఒక్కరోజు ఆదాయం రూ.4.91 లక్షలు


ఆలయ ఈవోకు చెక్కును అందిస్తున్న భక్తులు

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారికి ఆదివారం ఒక్కరోజు రూ.4,91,725 ఆదాయం లభించింది. ఇందులో టికెట్ల అమ్మకం ద్వారా రూ.2,33,900, విరాళాల రూపంలో రూ.66,199, ప్రసాదాల ద్వారా రూ.1,91,725 లభించినట్టు ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. అలాగే స్వామివారిని శ్రీకాకుళం నగరానికి చెందిన కసప భానుమూర్తి, జ్యోతి గణేష్ దంపతులు దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి నిత్యాన్నదాన పథకానికి రూ.1,11,116 చెక్కును ఆలయ ఈవో చంద్రశేఖర్‌కు అందజేశారు. వారిని ఆలయ అర్చకులు ఆశీర్వదించగా, ఈవో స్వామివారి జ్ఞాపికను అందజేశారు.

జగన్‌రెడ్డిది సంక్షోభ పాలన


కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న గొండు శంకర్

అరసవల్లి: జగన్‌రెడ్డిది సంక్షేమ పాలన కాదని, ముమ్మాటికీ సంక్షోభ పాలన అని శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. ఆదివారం నగరంలోని గుజరాతీపేట, ఏడు రోడ్ల జంక్షన్ వద్ద జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు.టీ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. అటు కేంద్రంలో నరేంద్ర మోదీ, ఇటు రాష్ట్రంలో చంద్రబాబు పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడం ఖాయమన్నారు. అన్ని రంగాల్లో సర్వనాశనమైన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెట్టాలంటే చంద్రబాబు వంటి సమర్థుడైన, అనుభవజ్ఞుడైన నాయకుడు అవసరమని, ఈ విషయాన్ని ప్రజలు గుర్తించారని, కూటమి విజయంతోనే ప్రజలు కష్టాలు తీరుతాయన్నారు. బీసీల కోసం తెలుగుదేశం ప్రకటించిన డిక్లరేషన్ చరిత్రలోనే ఒక సంచలనమన్నారు. ఒక సామాన్య కార్యకర్తనైన తనకు ఎమ్మెల్యే అయ్యే అవకాశం టీడీపీ కల్పించదచిందని, నియోజకవర్గ సమస్యలపై పూర్తి అవగాహన ఉందని, నిరంతరం ప్రజా సమస్యలపై పనిచేస్తానని తెలిపారు. వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. గుండ దంపతులు నా తల్లిదండ్రుల వంటి వారని వారి ఆశీర్వాదంతో, వారి అడుగుజాడల్లో పనిచేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, బీజేపీ నాయకుడు చల్లా వెంకటేశ్వరరావు, అంబటి లక్ష్మీరాజ్యం, కోరాడ సర్వేశ్వరరావు పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే స్థానిక 80 అడుగుల రోడ్డులో గల టీడీపీ జిల్లా కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం శ్రీకాకుళం నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి గొండు శంకర్ నిర్వహించారు. వలస నాయకుల పాలనలో శ్రీకాకుళం పూర్తిగా వెనుకబడిందని, వారి పెత్తనం ఇక చాలనిన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొండు జగన్నాథం, పీవీ రమణ, కోరాడ నర్సింగరావు, పద్మ, మైలపల్లి నర్సింగరావు, డొండపాటి నవీన్, రెడ్డి గిరిజాశంకర్, అంబటి లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

పార్టీలో కష్టించేవారికి తగిన గుర్తింపు


కలిశెట్టి అప్పలనాయుడితో మండల కాపు నాయకులు

పొందూరు: టీడీపీలో కష్టపడినవారికి గుర్తింపు ఉంటుందని చెప్పడానికి తనను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడమే నిదర్శ నమని ఆ పార్టీ విజయనగరం ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పల నాయుడు తెలిపారు. ఈ మేరకు అప్పలనాయుడును ఆదివా రం మండలానికి చెందిన టీడీపీ కాపు సామాజికవర్గ నాయకులు కలిశారు. ఎన్నికల్లో అఖండ విజయం సాధించాలని, అందుకు తమ వంతు సహకారం ఉంటుందని కాపు సామాజికవర్గ నాయకులు బలగ శంకరభాస్కర్, కె. గొల్లయ్య, పి. కన్నంనాయుడు తదితరులు ప్రకటించారు.

టీడీపీతోనే సంక్షేమం సాధ్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బెందాళం అశోక్

కవిటి: అనుభవంతో రాష్ట్రంలో ఆదాయాన్ని సృష్టించి సంక్షేమ పథకాలు అమలు చేయడం టీడీపీతోనే సాధ్యమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే అశోక్ తెలిపారు. ఆదివారం రామయ్యపుట్టుగలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో యువత భవిష్యత్తు చంద్రబాబుతోనే మెరుగుపడుతుందని తెలిపారు. యువత భవిష్యత్తును జగన్‌రెడ్డి నాశనం చేశారని విమర్శిం చారు. రాష్ట్రంలో ప్రజల జీవితాలను జగన్‌రెడ్డి వెనక్కినెట్టివేసి జీవితాలను నాశనం చేశారన్నారు. టీడీపీ అధినేత చేస్తున్న పోరాటానికి ప్రజలంతా మద్దతు తెలియజేయాలని కోరారు. దేశంలో అన్ని రాష్ట్రాలు ముందంజలో పరుగు పెడుతుంటే మన రాష్ట్రంలో వెనుకబడి పోతుందని తెలిపారు. సమావేశంలో టీడీపీ మండలాధ్యక్షుడు మణిచంద్రప్రకాష్, బి.రమేష్, ఎస్‌వీ రమణ, సంతోష్‌పట్నాయక్ పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో కూటమిదే విజయం

సరుబుజ్జిలి: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిదే విజయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శివ్వాల సూర్య నారాయణ తెలిపారు. ఆదివారం మండలంలోని సూర్యనారాయ ణపురం, శ్రీరామవలసల్లో టీడీపీ మండలాధ్యక్షుడు అంబళ్ల రాంబాబు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు లావేటి పూర్ణారావు, భీమవరం లక్ష్మీనాయుడు, అదపాక అప్పలనాయుడు, కూన గణపతిరావు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అసెంబ్లీ అభ్యర్థిగా కూన రవికుమార్, ఎంపీ అభ్యర్థిగా కింజరాపు రామ్మోహన్‌నాయుడులను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.

పెద్దపాడుపై ఎందుకంత వివక్ష

- మంత్రి ధర్మానపై వైసీపీ నాయకుడి ధ్వజం


మాట్లాడుతున్న కలగ శ్రీను

శ్రీకాకుళం క్రైం: పెద్దపాడు అంటే ఎందకంత వివక్ష అని, యాదవుల ఓటుతో మంత్రి స్థాయికి ఎదిగి తమ గ్రామంలో కనీసం శ్మశాన వాటికకు వెళ్లేందుకు రోడ్డు కూడా వేయించకపోవడం సరికాదని మంత్రి ధర్మాన ప్రసాదరావుపై అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వైసీపీ నాయకుడు కలగ శ్రీను ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆదివారం పెద్దపాడులోని తన నివాసంలో గ్రామ పెద్దలతో కలిసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఎన్నికలోనూ ఏమీ ఆశించకుండా యాదవులంతా మంత్రి ధర్మాన వెన్నంటే ఉన్నామని అటువంటి వారిని విస్మరించడం దుర్మార్గమన్నారు. శ్రీకాకుళం వచ్చిన కొత్తలో ధర్మాన ప్రసాదరావు రూ.3 వేలకు ఓ అద్దె ఇంట్లో ఉండేవారని, ఇప్పుడు వేల కోట్లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. మంత్రి కొడుకుగా తప్ప, ఎటువంటి అర్హత లేని రామ్‌మనోహర్‌నాయుడు 'పెద్దపాడు ఎవడబ్బ సొత్తు అని' వ్యాఖ్యానించడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నారు. గ్రామస్థులంతా టీడీపీకి అండగా నిలవాలని కోరుతున్నారన్నారు. సమావేశంలో యాదవ సంఘ నాయకులు, గ్రామ పెద్దలు తంగి సూర్యారావు, కలగ నర్సింగరావు, కాల వెంకటరావు, మామిడి శంకర్, కోరాడ చిన్నవాడు, తాన్ని శ్రీను, మామిడి తిరుమల, కలగదండు అప్పన్న, పళ్ల గోవిండ్ తదితరులు ఉన్నారు.

రాక్షస పాలనను తరిమికొట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఈఆర్

జి.సిగడాం: రాష్ట్రంలో రాక్షస పాలన రాజ్యమేలిందని, వైసీపీ ప్రభుత్వాన్ని తరిమికొట్టాలని ఎన్డీఏ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) పిలుపునిచ్చారు. ఆదివారం కుదిరిళ్ల బుజ్జి ఆధ్వర్యంలో పెనసాం గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన మండల టీడీపీ ఆత్మీయ సమావేశంలో ఎన్ఈఆర్ ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఒక్క చాన్స్‌తో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసి అప్పుల ఆంధ్ర ప్రదేశ్‌గా మార్చిన జగన్‌రెడ్డికి ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఇంటికీ ఒక ఉద్యోగం, ఉపాధి కల్పించి నిరుద్యోగ సమస్యలేకుండా చేసేలా కృషిచేయడం జరుగుతుందన్నారు. రామ రాజ్యం కావాలంటే కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబులు అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం మనందరిపైనా ఉందన్నారు. ఎవరూ బెదిరింపులకు బయపడేదిలేదని, తమకు అండగా ఉంటానని కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎన్ఈఆర్‌ని దుశ్శాలువా, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గొర్లె లక్ష్మణరావు, నాయకులు టంకాల మౌళీశ్వరరావు, కుదిరెళ్ల బుజ్జి, బెవర జగన్నాథరావు, కామోజుల సీతారాం, జక్కంపూడి దాసు, గోవిందరావు, జనసేన, బీజేపీ మండల అధ్యక్షుడు మీసాల రవికుమార్, వజ్జపర్తి రఘురాం, ఎస్.శ్రీరాములు, కూనుబిల్లి శ్రీనివాసరావు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి అమ్మవారి యాత్ర ప్రారంభం


అమ్మవారి ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

పొందూరు: పొందూరు పైడితల్లి అమ్మవారి 39వ యాత్ర ఆదివారం ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతించారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమ పొందూరులో ఊరేగించారు. మహిళలు కలశాతో ఊరేగింపులో పాల్గొన్నారు. కొండవీధి కూడలి నుంచి అమ్మవారి ఆలయం వరకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంటున్నాయి.


ఆదివారం వేకువజామున నీటి కోసం ఎదురుచూస్తున్న మహిళలు

తాగునీటి కోసం నిరీక్షణ

జి.సిగడాం: తాగునీటి కోసం గంటల కొద్దీ వేచిచూడాల్సిన పరిస్థితి. ప్రతి రోజూ వేకువ జాము నుంచే నీటి కోసం నిరీక్షణ తప్పడం లేదు. పెంట గ్రామ ప్రధాన వీధిలో అంతంత మాత్రంగా తప్పా విగతా వీధుల్లో తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయకపోవడంతో మహిళలు అవస్థలు పడుతున్నారు. వేకువ జామున నాలుగు గంటలకే కొళాయిల వద్ద బిందెలు పెట్టి నిరీక్షిస్తున్నారు. పెంట గ్రామంలో మీసాల వీధి, జంగాల వీధితోపాటు పలు వీధుల్లో ఇంటింటి కొళాయిలు ఏర్పాటు చేయకపోవడంతో తాగునీటి కోసం ప్రధాన వీధిలోకి రావాల్సి వస్తుందని మహిళలు వాపోతున్నారు. ఈసారి ఓట్లు అడగడానికి వచ్చే నాయకుడికి సరైన సమాధానం చెపుతామని బహిరంగంగా చెబుతున్నారు. గొంతు ఎండుతుంటే ప్రజా ప్రతినిధులకు పట్టదా? అంటూ ప్రశ్నిస్తున్నారు.

ఆదిత్యాలయంలో ధర్మపథం


కోలాటం ఆడుతున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఆలయ అనివెట్టి మండపంలో హిరమండలానికి చెందిన రామా సత్యనారాయణ కోలాట బృందం వారిచే కోలాట నృత్యం ని ర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఈ కార్యక్రమంలో కళాకారులను ఆలయ ఈవో చంద్రశేఖర్ అభినందించారు.

వలంటీర్లపై తప్పుడు ఆరోపణలు

ఆమదాలవలస: ప్రజలకు సేవ చేస్తూ స్వచ్ఛందంగా విధులు నిర్వహిస్తున్న వలంటీర్లపై ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నాయని స్పీకర్ తమ్మినేని సీతారాం తెలిపారు. ఆదివారం ఆమదాలవలసలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఏర్పాట్లుతోపాటు వలంటీరు వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలు, ప్రభుత్వానికి వారధులుగా నిలిపిందని తెలిపారు.

రూ.6 లక్షల నగదు సీజ్


సారవకోట: పట్టుబడిన నగదును లెక్కిస్తున్న అధికారులు

జలుమూరు (సారవకోట): ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.6,37,775 ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. ఆదివారం జలుమూరు మండ లం చల్లవానిపేట కూడలిలో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఎం.తిరుపతిరావు వాహన తనిఖీలు చేపట్టారు. పాతపట్నం నుంచి నరసన్నపేట వైపు వెళ్తున్న బొలేరా వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా ఎటువంటి ఆధారాలు లేని రూ.1,20,200 పట్టుబడినట్లు ఆయన తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. సీజ్ చేసిన నగదును నరసన్నపేట ఆర్వో రామ్మోహనరావుకు అప్పగించినట్లు తెలిపారు. ● సారవకోట సమీపంలో ఆదివారం అలుదు గ్రామానికి చెందిన పంగ సూరన్నాయుడు ద్విచక్ర వాహనాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సీహెచ్ సుజాత తనిఖీ చేశారు. బ్యాగును పరిశీలించగా ఎటువంటి ఆధారాలు లేని రు.5,17,575 నగదు పట్టుబడింది. ఈ నగదును సీజ్ చేసి నరసన్నపేట ఆర్వోకు అప్పగించినట్లు తెలిపారు.

కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు

పొందూరు: పొందూరులో వైసీపీ అభ్యర్థి తమ్మినేని సీతారాంతో ఎన్నికల ప్రచా రంలో పాల్గొన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఎ.రామకృష్ణపై కేసు నమోదైంది. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు పత్రికల్లో వచ్చిన కథనం ఆధారంగా ఎంసీసీ అధికారులు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుమేరకు కోడ్ ఉల్లంఘనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు.

అన్నివర్గాలపై భారం

పొందూరు: రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచడం ద్వారా భూములు, స్థలాల కొనుగోలుదారులపైనా భారం మోపారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పైడి నాగభూషణరావు ఆరోపించారు. ఆదివారం కింతలిలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రం లో మద్యం, ఇసుక, నిత్యావసర సరుకులు, పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడం ద్వారా వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో పేదప్రజల రక్తమాంసాలను పీల్చుకుతింటోందని ఆరో పించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో విద్యుత్ చార్జీలు పెంచడం ద్వారా అన్నివర్గాల ప్రజలపైనా తీవ్రమైన భారం మోపిందని ఆరోపించారు. ప్రజలకు రూపాయి ఇచ్చి వారి నుంచి 10 రూపాయలు దోచుకున్న ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని విమర్శించారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత ధరలు బాగా పెరిగాయని ఆందోళన వ్యక్తంచేశారు.

గెలుపే లక్ష్యంగా పనిచేద్దాం

జి.సిగడాం: గెలుపే లక్ష్యంగా ముందుకు వెళతామని మండల టీడీపీ నాయకులు అన్నారు. ఆదివారం విజయనగరం టీడీపీ ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడును దుశ్శాలువా, పుష్పగుచ్ఛాలుతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మండల నాయకులు మాట్లాడుతూ మీ వెంటే మేము ఉంటామని తమ గెలుపుకు సైనికుల్లా పనిచేసి విజయకేతనం ఎగరవేస్తామని అన్నారు. వైసీపీని ఓడించటమే తమ ప్రధాన లక్ష్యమని అందుకు విస్తృత ప్రచారం చేసి విజయతిలకం దిద్దుతామని అన్నారు. విజన్ గల నాయకులు చంద్రబాబు ముఖ్యమంత్రిని చేయటమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేసి టీడీపీకి పూర్వవైభవం తీసుకువస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కామోజుల సీతారాం, టంకాల వాసుదేవరావు, కిల్లారి శ్రీరామ్, పైల వెంకటరమణ, తాండ్రోతు శివ, చిత్తిరి గోవిందరావు, కామోజుల శంకరావు, చిత్తిరి చంద్రినాయుడు, టంకాల వేణు, మక్క నారాయణరావు, సిగటాపు గోవిందరావు

పారదర్శకంగా ఓటు వేయండి

శ్రీకాకుళం కల్చరల్: ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని తిప్పికొట్టాలని జైభారత్ జస్ట్ ఓట్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ రమణ అన్నారు. ఆదివారం ఏడు రోడ్ల జంక్షన్‌లో గల గరిమెళ్ల సత్యనారాయణ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశంలో ఎన్నికలే అతి పెద్ద పండుగలన్నారు. స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగిన ప్పుడే దేశం కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగా నికి ప్రతిఫలమని స్పష్టం చేశారు. ఓటుకో, మద్యానికో, ఓటు హక్కును అమ్ముకోవడం వల్ల ప్రశ్నించే హక్కును కోల్పోతున్నారన్నారు. కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాఘవదాస్ మాట్లాడుతూ.. నిజాయితీగా ఉన్నప్పుడే హక్కులు సాధించుకోగలమన్నారు. అనంతరం జస్ట్ ఓట్ క్యాంపెయిన్ పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ రాష్ట్ర సభ్యులు నాగభూషణరావు, పొన్నాల సోమేశ్వరరావు, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

పంటపై రైతుల 'చింత'

పలాస రూరల్: పలాస మండలం గిరిజన గ్రామాలైన పొత్రియ, బాపనూరు, గట్టూరు, కొరారింగి తాళభద్ర గ్రామాల్లో చింత చెట్ల పెంపకంపై రైతులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ ఏడాది వర్షాభావంతో చింతకాయలు పండకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎన్నో ఆశలతో ఈ ఏడాది చింతపంట చేతికి వస్తే అమ్మకాలు సాగించి లాభం పొందవచ్చనుకున్నామని, మా ఆశలు అడియాశలయ్యాయని వాపోతున్నారు. ఇప్పటికే మార్కెట్‌లో చింత కేజీ రూ.60 పైగా పలుకుతుండడంతో రైతులు ఎంతో ఆశలు పెట్టుకున్నారు. పూర్తిగా చింత పంట రాకపోవడంతో ఈ ప్రాంత గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా ఆశ వదులుకోవాల్సి వస్తుందని వాపోయారు.